ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



కర్ణాటక వార్తలు

శుక్రవారం 8 ఆగస్టు 2025

అంతర్గత రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే

- ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సహించేది లేదు
- 11 నుంచి బెంగళూరులో భారీ నిరసన: పోరాట కమిటీ ప్రకటన

8



కేఆర్ మార్కెట్‌లో కొనుగోళ్ల సందడి



రావమ్మా.. మహాలక్ష్మీ

- వరమహాలక్ష్మి వ్రతానికి సర్వం సిద్ధం
- పూలు, పండ్ల కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిట

బెంగళూరు, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసంలో అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే వరమహాలక్ష్మి వ్రతానికి సర్వం సిద్ధమయ్యింది. శుక్రవారం వ్రతాన్ని ఆచరించేందుకు మహిళలు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. గురువారం పూలు, పండ్లు కొనుగోళ్లతో మార్కెట్‌లు కిటకిటలాడాయి. ఏడాదిలో తొలి పెద్దపండుగ కావడంతో పాటు వరమహాలక్ష్మికి ప్రత్యేకంగా వివిధ రకాల పూలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఇందుకోసం మార్కెట్‌కు భారీగా (మిగతా 7వ పేజీలో)



ఫ్రీడం పార్క్ వద్ద ఏర్పాటు చేసిన రాహుల్ గాంధీ ఫ్లెక్సీ



బహిరంగ సమావేశానికి సిద్ధమైన భారీ వేదిక

నేడు కాంగ్రెస్ ఓట్ అధికార్ ర్యాలీ

- రాహుల్ నిరసన కోసం ఫ్రీడంపార్కులో ఏర్పాట్లు
- భారీగా తరలిరానున్న కార్యకర్తలు
- ఓట్ల చౌర్యాన్ని బయట పెట్టడమే లక్ష్యం: సీఎం

(వివరాలు 7లో..)



అందాలను మొబైల్‌లో బంధిస్తున్న విదేశీ యువతి



ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న పూల మందిరం

సమరయోధుల ప్రతిమలు భేష్

- లాల్‌బాగ్‌లో పూల ప్రదర్శన ప్రారంభోత్సవంలో సీఎం సిద్దరామయ్య



ప్రదర్శనను ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య, స్వామీజీలు

బెంగళూరు, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): బ్రిటీషువారి ఆగడాలను జీర్ణించుకోలేని కిత్తూరు రాణి చెన్నమ్మ, క్రాంతివీర సంగొళ్ళి రాయణ్ణల రూపాలు విషయాధారిత పూలప్రదర్శనల ఏర్పాటు నేటి విద్యార్థులు వారి త్యాగాలను గుర్తుచేసుకునేలా సందేశం ఇస్తోందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని లాల్‌బాగ్ ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన పూల ప్రదర్శనలను గురువారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంగా సీఎం మాట్లాడుతూ బ్రిటీషువారితో ఎంతోమంది ప్రాణాలను లెక్కచేయకుండా పోరాటాలు చేశారన్నారు. అటువంటి వీరుల త్యాగాల గురించి అందరూ తెలుసుకోవాలన్నారు. గాంధీజీ పోరాటం అహింస, శాంతియుతంగా సాగిందన్నారు. త్యాగధనుల నైతిక విలువలను నేటి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. రాజుల కాలం నాటి కోటలు అందంగా తీర్చారన్నారు. ఉద్యానవన శాఖా మంత్రి ఎస్‌ఎస్ మల్లికార్జున పర్యవేక్షణలో పూల ప్రదర్శన ఏర్పాట్లు సాగాయి. ఉద్యానవన శాఖ డైరెక్టర్ సీఎస్ రమేష్ మాట్లాడుతూ 218వ పూల ప్రదర్శనలు సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేశామన్నారు. సందర్శకులు నేరుగా వచ్చి టికెట్ కొనుగోలుతో పాటు ఆన్‌లైన్ ద్వారా కూడా పొందే సౌకర్యం తొలిసారి ఏర్పాటు చేశామన్నారు. అయితే ఆన్‌లైన్‌లో ఒకసారి సమయం నిర్ధారించుకుని టికెట్‌లు కొనుగోలు చేస్తే మార్పు చేసుకునేందుకు వీలు ఉండదన్నారు. ప్రదర్శనలు ఈనెల 18వ తేదీ వరకూ కొనసాగుతాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6.30గంటల దాకా సందర్శించేందుకు వీలుందన్నారు. సాధారణ రోజుల్లో టికెట్ ఒకరికి రూ.80లు కాగా వారాంతం, స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఒకరికి రూ.100గా ఉంటుందని పిల్లలకు అన్నిరోజులూ రూ.30గా నిర్ణయించామన్నారు. 9వతేదీ శనివారం ఇకెబాన కళల ప్రదర్శనలు ప్రారంభం, 11వ తేదీ హైస్కూల్ విద్యార్థులకు పోటీలు, 16న బహుమతుల ప్రధానంలు ఉంటాయన్నారు. అనుబంధమైన లాల్ బాగ్ డైరెక్టర్ లాల్‌బాగ్‌హరిహర వీరశైవ లింగాయత పంచమసాలి గురుపీఠం వచనానంద స్వామీజీ, మహర్షి వాల్మీకి గురుపీఠం ప్రసన్నానందపురి స్వామీజీలు ముఖ్యులుగా పాల్గొన్నారు. మంత్రులుం రామలింగారెడ్డి, డాక్టర్ సుధాకర్‌తో పాటు ఎమ్మెల్యే ఉదయ్‌గరుడాచార్‌తో పాటు ఉద్యానవనశాఖ డైరెక్టర్ రమేష్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు. పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనను తిలకించారు.



పూల ప్రదర్శనలో రాణి చెన్నమ్మ విగ్రహం

పాఠశాలల పర్యవేక్షణకు ప్రత్యేక యాప్

- అన్ని వివరాలు అందులోనే..
- విడుదల చేయనున్న విద్యాశాఖ
- అధికారులకు ప్రత్యేక శిక్షణ

బెంగళూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్ని విభాగాలు డిజిటలీకరణ, స్మార్ట్‌గా మారిపోతున్నాయి. విద్యార్థుల హాజరు, పాఠశాల పరిశీలనలు ఒకప్పుడు చుట్టపుచూపుగా సాగేది. రెండు మూడు నెలలకోసారి హోబళి స్థాయి అధికారులు పరిశీలించేవారు. అయితే ఇకపై పాఠశాలల పరిశీలనకు వెళ్లే అధికారులు కూడా మరింత స్మార్ట్ విధానాలు అనుసరించనున్నారు. ఉత్తర ప్రత్యుత్తరాలు కాగితాలపై కాకుండా ఫోన్‌లలోనే సమాచారం అప్‌లోడ్ చేయనున్నారు. ఇందుకోసం ప్రాథమిక విద్యాశాఖ ఈ-పాలనవిభాగంతో కలసి ప్రత్యేక మొబైల్ యాప్‌ను సిద్ధం చేస్తోంది. పాఠశాల పరిశీలనకు వెళ్లే అధికారులు నేరుగా ఫొటో తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అవసరమైన సౌకర్యాలను చెక్ లిస్ట్‌లోనే పొందుపరుస్తారు. వాటి ప్రకారం సమాచారాన్ని అధికారులు భర్తీ చేస్తే చాలు. నేరుగా విద్యాశాఖ రాష్ట్రస్థాయి అధికారులకు సమాచారం చేరనుంది. గతంలో ఉపాధ్యాయులు పాఠశాలల సమస్యలను హోబళి స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ద్వారా జిల్లాస్థాయి, అక్కడనుంచి రాష్ట్రస్థాయి అధికారులకు సమాచారం పంపేవారు. ఈ ప్రక్రియలో ఏ అధికారి అయినా ప్రాథమికంగా డిమాండ్లను తిరస్కరిస్తే ఇక వాటికి మోక్షం ఉండేది కాదు. కానీ డిజిటల్ రూపంలో పాఠశాలల సమస్యలను పొందుపరిస్తే కేవలం కొన్ని గంటల్లోనే ఉన్నతస్థాయి అధికారులకు సమాచారం చేరుతుంది. పైగా ఎవరూ వాటిని మార్పు చేసేందుకు వీలుండదు. పాఠశాలలో ఎటువంటి సమస్యలు ఉన్నాయనేది తెలుసుకునేందుకు ఉన్నతాధికారులకు వీలుంటుంది.

విద్యాశాఖ క్లస్టర్ రీసోర్స్ పర్సన్(సీఆర్‌పీ), బేసిక్ రీసోర్స్ పర్సన్ (బీఆర్‌పీ), క్షేత్రస్థాయి విద్యాశాఖ అధికారి (బీఈఓ), జిల్లా డిప్యూటి డైరెక్టర్ (డిడిపిఐ)లు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి చెక్‌లిస్ట్ ఆధారంగా పరిశీలన చేయాలి. సాధారణంగా సంబంధిత అధికారులు ప్రతినెలా 15-20 పాఠశాలలను సందర్శించి నివేదికలు రూపొందించాలి. క్లస్టర్ రీసోర్స్ పర్సన్ పాఠశాలలో బోధనల గుణాత్మకత ప్రగతిపరంగా ఉందా లేదా..? అని పరిశీలించి మార్పులు ఏ విధంగా అమలు చేయాలి? అనేది, కార్యాచరణకు సంబంధించి పరిశీలిస్తారు. పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు, సమయానికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం సమకూర్చడం, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన సమస్యలు, గుడ్డు, అరటిపండు, పాలు, సకాలంలో అందుతోందా..? అని పరిశీలించాల్సి ఉంటుంది. ఇలా బీఈఓలు తమ పరిధిలోని అన్ని పాఠశాలల సౌలభ్యాలు, గుణాత్మకత, పౌష్టికాహారం వంటి అన్ని కోణాలలోనూ పరిశీలించాల్సి ఉంటుంది.

కొత్తగా రూపొందిస్తున్న యాప్ అమలులోకి వస్తే అన్ని పాఠశాలల సమగ్ర సమాచారాన్ని ముందుగా యాప్‌లో డౌన్‌లోడ్ చేస్తారు. తద్వారా రియల్‌టైం డేటా లభించనుంది. ఇప్పటికే జిల్లాస్థాయి, బీఈఓ అధికారులకు యాప్‌కు సంబంధించి శిక్షణలు ఇచ్చారు. యాప్‌లో పాఠశాల చిరునామా, విద్యార్థుల సంఖ్య, పాఠశాల భవనాల పరిస్థితి, ఉపాధ్యాయులు సకాలంలో హాజరవుతున్నారా..? పాఠశాల సమయంలో ఉపాధ్యాయులు మొబైల్‌ను నిషేధించారా..? లేదా పరిశీలిస్తుంటారా..? పాఠశాల సౌకర్యాలు విద్యార్థులకు అనుకూలంగా ఉన్నాయా..? లేదా సమస్యలు ఏమైనా ఉన్నాయా అనేది యాప్‌లో నమోదు చేసేందుకు వీలుంది. దాదాపు విద్యాశాఖ అధికారులు పాఠశాలలకు వెళ్లి పరిశీలన చేయకుండానే నివేదికలు రూపొందిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో పారదర్శకత లేకుండా పోతోందని మొబైల్ యాప్‌ను రూపొందించారు. జియో ట్యాగ్ ద్వారా ఫొటో తీయాలనే నిబంధన ఉండడంతో అధికారుల దొంగాటకు బ్రేక్ పడనుంది. అంతేకాకుండా అన్ని పరిశీలనలు గడువులోగా పూర్తి చేయాల్సి ఉంది. తద్వారా ఎక్కువ సమయం వృథా కాదు.

- మొబైల్ యాప్ రూపకల్పనపై ప్రాథమిక విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ కేవీ త్రిలోక్‌చంద్ర అభిప్రాయం మేరకు మొబైల్ యాప్‌కు సంబంధించి అధికారులకు శిక్షణలు ఇచ్చామని, త్వరలోనే విడుదల చేస్తామని, ఆ తర్వాత అన్ని పరిశీలనల వివరాలు యాప్‌లోనే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. తద్వారా రియల్‌టైం డేటా లభించనుందన్నారు.

నేరుగా ఉన్నతాధికారులకు సమాచారం



త్వరలోనే మొబైల్‌యాప్‌ను విద్యాశాఖ మంత్రి విడుదల చేయనున్నారు. తద్వారా పాఠశాల పరిశీలన ప్రక్రియ మొబైల్ ద్వారానే కొనసాగుతుంది. రాష్ట్రంలో 46,757 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 42.92లక్షలమంది విద్యార్థులు చదువుతున్నారు. 1.77 లక్షలమంది ఉపాధ్యాయులున్నారు. యాప్ వినియోగానికి సంబంధించి హోబళి, జిల్లా స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఇంతకుముందు విద్యాశాఖ అధికారులు భౌతికంగా పాఠశాలను పరిశీలించినవేళ ప్రాధాన్యతాపరమైన సమస్యలను చెక్‌లిస్ట్ పెట్టుకుని గమనించేవారు. అక్కడి సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో పంపేవారు. ఈ సమాచారం విద్యాశాఖ కమిషనర్‌దాకా చేరేది కాదు. పరిణామంగా పాఠశాలలో అవసరమైన సదుపాయాలు, నాణ్యత, నైపుణ్యతకు సంబంధించి కమిషనర్ స్థాయి అధికారులకు చేరేది కాదు. ప్రస్తుతం మొబైల్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తే సమగ్ర సమాచారం ఉన్నతస్థాయి అధికారికి చేరిపోనుంది. జిల్లాల వారీగా ఎటువంటి సమస్యలు ఉన్నాయనేది సులభతరంగా తెలుసుకోగలుగుతారు.

మూటలో కాళ్లు, చేతులు

- తుమకూరు జిల్లా కొరటగెరెలో దారుణహత్య
- అవయవాలను ముక్కలు చేసి రోడ్డుపై పడేసిన దుండగులు
- మృతదేహం మహిళదిగా అనుమానం

నా ప్రేయసికి నేనంటే ప్రాణం

- ఈకేసులో ఆమె పేరును చేర్చకండి ప్లీజ్
- డెత్‌నోట్ రాసి యువకుడి ఆత్మహత్య

వివరాలు 7లో..



పరీక్షల కోసం చేసిన ఏర్పాట్లు

నేటి నుంచి ఆర్మీ ర్యాలీ

- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- హాజరుకానున్న బెళగావి, బీదర్, కలబురగి, కొప్పళ, యాదగిరి, రాయచూరు జిల్లాల అభ్యర్థులు
- అభ్యర్థులకు ఉచిత భోజన వసతి

(వివరాలు 7లో..)

దేశభద్రతలో భాగస్వాములు కావాలి

- విద్యార్థులకు శివమొగ్గ ఎస్పీ మిథున్‌కుమార్ పిలుపు



బెంగళూరు, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి) : దేశం కోసం పనిచేయడం సవాల్‌గానే కాకుండా ఒక గౌరవంగా భావించాలని అటువంటి కోర్సుల్లో చేరేందుకు వచ్చిన విద్యార్థులు దేశభద్రతలో భాగస్వామ్యులు కావాలని శివమొగ్గ ఎస్పీ మిథున్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం శివమొగ్గలోని రాష్ట్రీయ రక్షా విద్యాలయలో అకడమిక్‌లో చేరిన విద్యార్థులకు స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇదే సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ దేశభద్రత, జాతీయ భద్రత, పోలీసు చట్టాలు, పాలనా విషయాలను ప్రతి యువకుడు తెలుసుకోవాలన్నారు. ఆంతరంగిక భద్రత, చట్టాల అమలు, సోషల్ మీడియా, పాలన, ప్రజారక్షణ వంటి ప్రతిష్టాత్మకమైన కోర్సులలో రాష్ట్రీయ రక్షా విద్యాలయం బోధిస్తోందన్నారు. అత్యాధునిక సాంకేతిక ఆధారిత ప్రయోగాత్మక శిక్షణలు ఇస్తున్న ఏకైన విద్యాలయంగా అభివర్ణించారు. భద్రతా సవాళ్ళు, సామర్థ్యం, ఆత్మవిశ్వాసంతో ఎదురించేందుకు విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. నైతిక విలువలతో పాటు సమాజంలో ఆదర్శంగా ఉండేందుకు పాటుపడేలా ఎదగాలని పిలుపునిచ్చారు. కర్ణాటక క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కావేరి టండన్ మాట్లాడుతూ ఆంతరంగిక భద్రత, పోలీస్, రక్షణ, కార్యాచరణ అధ్యయనాలు, ఆధునికత, సమగ్రత సేవలను నేర్పించేందుకు విద్యాలయ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కొత్తగాకోర్సులలో చేరిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులు



నీటమునిగిన టమోటా పంట

రైతును ముంచేసిన నారాహల్లి

- జలాశయంలోకి భారీగా చేరిన వరద నీరు
- నీట మునిగిన కాల్వల కింద పొలాలు
- నష్టాలు తప్పవని రైతుల ఆవేదన

8

పుట్టపర్తికి నిధులివ్వండి

కేంద్ర మంత్రికి ఎంపీ బీకే వినతి


కేంద్ర పర్యాటక మంత్రి షెకావత్‌కు వినతిపత్రం అందిస్తున్న బీకే

పెనుకొండ, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిని అంతర్జాతీయ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి నిధులు ఇవ్వాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు హిందూపురం ఎంపీ పార్థసారథి విన్నవించారు. అభివృద్ధి ప్రణాళికను పరిశీలించి, ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సాయం అందించాలని కోరుతూ గురువారం వినతి పత్రం సమర్పించారు. ఢిల్లీలో ఆయన కేంద్ర మంత్రిని కలిశారు. భగవాన్ సత్యసాయి బాబా జన్మస్థలమైన పుట్టపర్తి ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతోందని వివరించారు. అనేక దేశాల భక్తులు పుట్టపర్తిని సందర్శిస్తున్నారని అన్నారు.అలాంటి పుట్టపర్తిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని కేంద్ర మంత్రికి వివరించారు.

సెలవుల సందడి

ప్రయాణికులతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్లు

అనంతపురం టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో ప్రధాన పండుగలైన వరలక్ష్మీ వ్రతం, రాఖీ పౌర్ణమి వరుసగా రావడం, ఆ మరుసటిరోజే ఆదివారం సెలవు కావడంతో జిల్లావ్యాప్తంగా సందడి వాతావరణం కనిపిస్తోంది. విద్యాసంస్థలకు వరుసగా మూడురోజులు సెలవులు వదలడంతో విద్యార్థులంతా సొంతూరి బాట పట్టారు. దీంతో గురువారం అనంతపురం బస్టాండు ప్రయాణికులతో కిటకిటలాడింది. తమ ఊరి బస్సులో సీట్లు పట్టుకునేందుకు పిల్లలు, పెద్దలు ఎగబడ్డారు. బస్సు సర్వీసులు తక్కువగా ఉండే రూట్లలో తమ ఊరి బస్సు ఎప్పుడొస్తుందా అంటూ ప్రయాణికులు వేచిచూడడం కనిపించింది. మొత్తంగా వరుస సెలవుల కారణంగా గురువారం రీజియన్ వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్లన్నీ కిక్కిరిసిపోయాయి.


అనంతపురం: మా ఊరి బస్సు ఎప్పుడొస్తుందో.. ఏమో..




సీటు దొరికితే చాలు.. పండుగే..


వామ్మో.. ఏమి జనం..! ఇసుకేస్తే నేలరాలదంతే..!

చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ఏపీ చేనేత సంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ చేనేత సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీరాములు, గోవిందు డిమాండ్ చేశారు. ఏపీ చేనేత సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నగరంలో నేతన్నలు భారీ ర్యాలీ నిర్వహించారు. నేత బజార్ వద్ద నేతన్నల మెడకు ఉరితాళ్లు బిగించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చేనేత నాయకులు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేనేత కుటుంబాలకు ఏడాదికి రూ.36వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబానికి రూ.7లక్షలు చెల్లిస్తామని విస్మరించడం దారుణమన్నారు. చేనేతలకు బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయిస్తామన్న ప్రభుత్వం ఇంతవరకు ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య మాట్లాడుతూ చేనేతలను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ర్యాలీలో పురుషోత్తం, వెంకటరమణ, శేఖర్, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, రామాంజి తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో చేనేత కార్మికుల ర్యాలీ

మహాత్మా...! కళ్లు తెరిపించు

- గాంధీ విగ్రహానికి చేనేతల వినతి

ధర్మవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మహాత్మా..! పాలకుల కళ్లు తెరిపించి, చేనేత కార్మికులను కాపాడేలా చూడాలని గాంధీ విగ్రహానికి ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకుడు ఎస్‌హెచ్‌బాషా వినతి పత్రం ఇచ్చారు. జాతీయచేనేత దినోత్సవం సందర్భంగా గురువారం ఏపీ చేనేత కార్మికసంఘం ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీఎస్టీ రద్దు, నేతన్న నేస్తం వంటి హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంపర్తి పరమేశ్, చేనేత కార్మికసంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఖాదర్‌బాషా, గుంపుహరి, జంగాలపల్లిపెద్దన్న, జేవీరమణ, మారుతి, అయూబ్‌ఖాన్,ఎల్ ఆదినారాయణ, వెంకటస్వామి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.


మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చేనేత కార్మికసంఘం, కాంగ్రెస్ నాయకులు

జాతీయ అవార్డు అందుకున్న ధర్మవరం డిజైనర్

ధర్మవరం, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చేనేత డిజైనర్ జూజూరు నాగరాజు కేంద్రమంత్రి నుంచి జాతీయ అవార్డును అందుకున్నారు. దేశరాజధాని న్యూఢిల్లీలో 11వ జాతీయ చేనేత దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం గురువారం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి దేశంలోని పలువురు చేనేత కార్మికులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు. ఈక్రమంలోనే పట్టు చీరలపై అద్భుతాలు సృష్టించి, ఎన్నో పురస్కారాలు అందుకున్న నాగరాజును గుర్తించి కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేంద్రజౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, ఎంపీ కంగనారనౌత్, హ్యాండ్‌లూమ్ కమిషనర్ బీనా, ఇతర శాఖల మంత్రులు, అధికారుల చేతుల మీదుగా నాగరాజుకు అవార్డును అందజేశారు.


కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ నుంచి జాతీయస్థాయి అవార్డు అందుకుంటున్న డిజైనర్ జూజూరు నాగరాజు

కదిరి బైపాస్ రోడ్డుపై రాకపోకలు ప్రారంభం


బైపాస్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించిన కదిరి బైపాస్ రోడ్డులో రాకపోకలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం ప్రారంభించారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వం అప్పట్లో రూ.286 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఆ తరువాత కొలువుదీరిన వైసీపీ ప్రభుత్వం పనులను అటకెక్కించింది. గతేడాది కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే బైపాస్ రోడ్డులో రాకపోకలకు చర్యలు తీసుకుంది. హిందూపురం రోడ్డునుంచి మదనపల్లి రోడ్డు వరకు బైపాస్ రోడ్డు పూర్తయింది. ఆ రోడ్డులో రాకపోకలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధిలో భాగంగా ఈ బైపాస్ రోడ్డులో రాకపోకలు ప్రారంభించామన్నారు. ఇక నుంచి భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, పెద్ద ఆటోలు హిందూపురం రోడ్డునుంచి బైపాస్‌రోడ్డులో వచ్చి పీవీఆర్ సర్కిల్‌లోని కదిరి, మదనపల్లి రోడ్డులో కలుస్తాయి. అక్కడి నుంచి నేరుగా బస్టాండు వైపు వెళ్తాయి. పట్టణంలో ట్రాఫిక్ తగ్గించాలన్న ఉద్దేశంతో ఈరోడ్డులో రాకపోకలు ప్రారంభించినట్లు చెప్పారు. హిందూపురం, బెంగుళూరునుంచి వచ్చే ప్రయాణీకులకు అసౌకర్యంగా ఉన్నా.. పట్టణ అవసరాల దృష్ట్యా సర్దుకుపోవాలన్నారు. త్వరలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఆధ్వర్యంలో రెండు, మూడు ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటు చేసి, ఎంపీడీఓ కార్యాలయ సర్కిల్ నుంచి కోనేరు వరకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఇది భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శివనారాయణస్వామి, కమిషనర్ కిరణ్‌కుమార్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానికతను తెలిపితేనే సార్థకత

- విశ్రాంత ఇంజనీరు శంకర్‌నారాయణ
- మనమెరుగని లాటిన్ అమెరికా ఆవిష్కరణ


ప్రసంగిస్తున్న శంకర్‌నారాయణ

అనంతపురం టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రజల సాంఘిక, సాంస్కృతిక జీవన పరిస్థితులను తెలుసుకునేలా యాత్రలు ఉండాలని బీఎస్ఎన్ఎల్ విశ్రాంత డివిజనల్ ఇంజనీరు శంకర్‌నారాయణ అన్నారు. దాసరి అమరేంద్ర తెలుగులోకి అనువదించిన 'మనమెరుగని లాటిన్ అమెరికా' పుస్తక పరిచయ సభను గురువారం సాయంత్రం ఎన్జీఓ హోంలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో దాసరి అమరేంద్ర ప్రసంగించారు. స్థానిక సంస్కృతితో సంపర్కం చెందకుండా చేసే యాత్రలు నిష్ఫలమని అన్నారు. డాక్టర్ శేషగిరి లాటిన్ అమెరికా దేశాలలోని ప్రజలతో మమేకమై, అక్కడి సంస్కృతి, జీవన విధానాలను పుస్తకరూపంలోకి తీసుకువచ్చారని అన్నారు. ఆ పుస్తకాన్ని దాసరి అమరేంద్ర 'మనమెరుగని లాటిన్ అమెరికా' పేరుతో ఇక్కడి వారికి అర్థమయ్యేలా తెలుగులో అనువదించడం అభినందనీయమని అన్నారు. ఆయా దేశాల్లో జన సాంస్కృతిక వైరుధ్యాలను అర్థం చేసుకున్న రచయిత ఆలోచనలను ఈ పుస్తకం ప్రతిబింబిస్తుందని అన్నారు. నేటివ్ అమెరికన్లు ఈ దేశాల ప్రజలేనని, వారి ఆచార వ్యవహారాలను, ఆహారపు అలవాట్లను డాక్టర్ శేషగిరి పాఠకులకు పరిచయం చేశారని అన్నారు. అమరేంద్ర అంతే సమర్థవంతంగా తెలుగీకరించారని అభినందించారు. కార్యక్రమంలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ప్రతినిధి ఏజీ రాజమోహన్, మానవహక్కుల వేదిక నాయకులు ఎస్‌ఎం బాషా, చంద్రశేఖర్, డాక్టర్ ప్రసూన, రచయితలు రాజారామ్, తరిమెల అమర్నాథరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ, ఉప్పరపాటి వెంకటేశులు, జూటూరు షరీఫ్, రియాజుద్దీన్, టీవీ రెడ్డి, సత్యబోస్, గోవిందరాజులు, అనంత మాలతి తదితరులు పాల్గొన్నారు.

గడేకల్లులో గజదొంగలు

- పనులు చేయకుండానే బిల్లులు డ్రా
- రూ.18 లక్షలు స్వాహా
- వైసీపీ, టీడీపీ నాయకుల కుమ్మక్కు
- సోషల్ మీడియాలో వైరల్

విడపనకల్లు, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు గ్రామంలో గజదొంగలు పడ్డారు. ఒక్క పని చేయకుండానే రూ.18 లక్షలు డ్రా చేసుకుని పంచుకుతిన్నారు. ఈ అక్రమాల వ్యవహారం కలకలం రేపుతోంది. సోషల్ మీడియాలో సంచలనమైంది. వారం రోజులుగా హాట్ టాపిక్‌గా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామంలో కొంతమంది టీడీపీ నాయకులు..



వైసీపీ వారితో కుమ్మక్కయ్యారు. నీకు ఇంత.. నాకు ఇంత.. అని పనులు చేయకుండానే బిల్లులు డ్రా చేసుకు తిన్నారంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గడేకల్లు సర్పంచ్ వైసీపీ మద్దతుదారుడు కావడంతో గ్రామం పరిధిలో ఎలాంటి బిల్లు కావాలన్నా... సర్పంచ్ సంతకం తప్పనిసరి. దీంతో టీడీపీ నాయకులు.. వైసీపీ వారితో కుమ్మక్కయ్యారు. పనులు చేయకుండానే బిల్లులు మింగేశారు. విషయం బయటకు పొక్కడంతో కొంతమంది గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కొన్నిరోజుల క్రితం పంచాయతీ రికార్డులను బయటకు తీసి పరిశీలించారు. ఎక్కడెక్కడ పనులు చేశారు, వాటి వివరాలు బిల్లులు సహా బయట పెట్టారు. ఒక్క పని కూడా చేయలేదని తెలిసి గడేకల్లు గ్రామ సచివాలయానికి చేరుకున్నారు. పనులు చేయకుండానే బిల్లులు ఎలా పెట్టారని అధికారులను నిలదీశారు. బిల్లులు పెట్టిన ప్రకారం పనులు ఎక్కడ చేయించారో చూపించాలంటూ అధికారులతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. గడేకల్లు గ్రామంలో మరుగుదొడ్లు కట్టినట్లు రికార్డులు చేశారు. గ్రామంలో ఎక్కడా అలాంటివి నిర్మించలేదు. అయినా బిల్లులు మాత్రం లక్షల్లోనే డ్రా చేశారు. నీటి శుద్ధికి ఏకంగా రూ.4లక్షలు ఖర్చు చేసినట్లు రికార్డులు చేశారు. ఒక్క పని కూడా చేయలేదని గ్రామస్థులు స్పష్టం చేస్తున్నారు.


Ukd Politics
14h

విడపనకల్లు మండలం గడేకల్లులో అధికారులు మంజూరు చేసిన బిల్లులలో మచ్చుకు కొన్నింటిని పోస్ట్ చేశాం. పని వివరం, బిల్లు పొందిన వ్యక్తి, డ్రా చేసిన మొత్తాన్ని పరిశీలించండి. మీ గ్రామంలో వీటన్నింటినీ సక్రమంగా చేశారా? లేదా? అన్నది తెలుసుకొని.. గ్రామానికి మేలు చేస్తున్నారా? లేక నిధులు నొక్కుతున్నారా? ఓ అంచనాకు రండి. ఆ తర్వాత మీ తీర్పు రాబోయే స్థానిక ఎన్నికల్లో ఇవ్వండి. మంచి అయితే మంచి, చెడు అయితే చెడు. అంతిమ నిర్ణయం ప్రజలదే.

చెప్పడం మావంతు..!

నిర్ణయం మీ వంతు..!

1 comment

Like Comment Send Share

Water Purification System That Wastes Less Water 92923702

Purpose
Pipe Line Works

Amount ₹ 4,26,294

e-Payment Order Created (4 mons 13 days

Paid To
THASI UMASANKAR

Bank Account No
*******4401

Payment Proposed by (Sachiv) DSC (4 mons 13 days ago)

IFSC Code
NA

Voucher No./Date XVEC/

సోషల్ మీడియాలో అక్రమ బిల్లులు

బిల్లులో అలా నమోదు చేసినా..

పంచాయతీలో డబ్బులు తక్కువగా ఉంటే పీఎఫ్ఎంఎస్ నిధులను వినియోగించుకోవచ్చు. బిల్లులో ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణానికి, తాగునీటి కోసం నమోదు చేసినా.. అ నిధులను గ్రామంలో చేసిన ఇతర పనులకు వాడుకోవచ్చు. మరుగుదొడ్లే నిర్మించకపోయినా వాటి నిర్వహణకు అని చెప్పి బిల్లులు డ్రా చేసుకోవచ్చు.

-సత్యబాబు, ఈఓఆర్డీ

డ్రా చేసుకున్న బిల్లులు

- గతేడాది సెప్టెంబరు 6న రూ.97,500
- అక్టోబరు 29న రూ.57,230, రూ.40,270, అక్టోబరు 30న రూ.15,730, నవంబరు 20న రూ.1,96,316
- ఈ ఏడాది జనవరి 28న మేకల భీమేష్ పేరున రూ.1.33 లక్షలు, జనవరి 29న కర్రెన్నగారి రాముడి పేరున మరుగుదొడ్డి నిర్మించినట్లు రూ.78,560, జనవరి 30న కర్రెన్నగారి రాముడి పేరున నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు రూ.24,210, వైసీపీకి చెందిన గడేకల్లు సర్పంచ్ సుశీల భర్త ఉమా శంకర్ పేరున నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు రూ.4.26 లక్షలు
- ఫిబ్రవరి 6న కురుబ రామాంజనేయులు పేరున రూ.48,380
- ఏప్రిల్ 8న ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.1.63 లక్షలు, మొండ్ల శివశంకర్ పేరున డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌కు రూ.97,500, టీడీపీ నాయకుడు ముద్దూరి శ్రీనివాసులు పేరున నాలుగు బిల్లులు పెట్టారు. ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.1,10,035, ఇతర పనులకు రూ.1,82,524, రూ.68,843, రూ.87,313 బిల్లులు డ్రా చేశారు.


మండల ఏపీఎం కార్యాలయం

చిక్కింది చాన్స్ అని..

అనంతపురంరూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లో సభ్యుల నమ్మకాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు యానిమేటర్లు స్వాహా పర్వానికి తెర తీశారు. ఇలాంటి వ్యవహారమే రూరల్ మండలంలోని ఆకుతోటపల్లిలో వెలుగులోకి వచ్చింది. అక్కడ పని చేసే ఓ యానిమేటర్ మహిళా సంఘాల సొమ్మును తన ఖాతా లోకి మళ్లించుకుని స్వాహా చేశారు. ఇలా దాదాపు రూ.30 లక్షల మేర కాజేసినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత అధికా రులు వ్యవహారం బయటకు పొక్కకుండా యానిమేటర్‌తో రికవరీ చేయిస్తున్నారు.

పొదుపు.. అప్పుల విచారణతో వెలుగులోకి..

వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రామంలో పని చేస్తున్న యానిమేటర్‌ను తొలగించారు. అతడి స్థానంలో అప్పటి రాజకీయ నాయకుల ఒత్తిడితో ఓ మహిళను యానిమేటర్‌గా నియమించారు. 2021 ఆగస్టు నుంచి 2024 జూన్ ఆఖరి వరకు ఆమె పని చేశారు. ఆ సమయంలోనే మహిళల సొమ్ము స్వాహా జరిగినట్లు తెలుస్తోంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తిరిగి యానిమేటర్ మార్పు జరిగింది. ఈక్రమంలో గ్రూపులు, సభ్యుల అప్పులు, పొదుపు వివరాల విచారణ క్రమంలో స్వాహా వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

నమ్మకం, అమాయత్వమే ఆసరా

గ్రామాల్లో చాలా మంది కూలి పనులు, వ్యవసాయ పనులు ఇతరత్ర వాటికి వెళ్లి జీవనం సాగిస్తుంటారు. అలా వచ్చిన సొమ్మును డ్వాక్రా సంఘాల ద్వారా పొదుపు చేసుకుంటారు. అవసరార్థం సంఘంలో అప్పు తీసుకుని నెల..నెలా చెల్లిస్తారు. ఈక్రమంలో చాలా మంది యానిమేటర్‌ను మీదనే ఆధారపడి చెల్లింపులు చేస్తుంటారు. ఇదే ఆసరగా ఆ యానిమేటర్ గ్రూపు సభ్యుల సొమ్మును కాజేసినట్లు తెలు స్తోంది. ఈక్రమంలో రూ.పదిహేను లక్షలకుపైగానే కాజేసినట్లు తెలు స్తోంది. తనకంటూ ఓ ప్రత్యేక తీర్మానం చేసుకుని గ్రూప్రసభ్యులతో సంతకాలు చేయించుకున్నట్లు తెలుస్తోంది. అందులో తన సొంత బ్యాంకు ఖాతా నెంబరు రాసుకుని తీర్మాన కాపీలను బ్యాంకులో ఇచ్చి.రుణాలు, ఇతరత్ర సొమ్ము మరో రూ.14లక్షలు తన ఖాతాలో జమ చేసుకున్నట్లు తెలుస్తోంది. తన పరిధిలోని ఒక్కో గ్రూపులో రూ.యాభై వేలు మొదలు కొని..రూ.లక్ష, రెండు లక్షలు, నాలుగు లక్షల వరకు గ్రూపు సభ్యులకు తెలియకుండా సొమ్మును తన సొంత ఖాతాలోకి జమచేసుకున్నట్లు సమాచారం. దాదాపు పది గ్రూపులకు సంబంధించిన సభ్యుల సొమ్మును ఎవరికి అనుమానం రాకుండా కాజేసినట్లు చర్చసాగుతోంది.

గుట్టుగా రికవరీ

డ్వాక్రా సంఘంలో జరిగిన అవినీతిని తెలుసుకున్న సంబంధిత అధికారులు గుట్టుచప్పుడుకాకుండా రికవరీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల లెక్కప్రకారమే రూ.20లక్షలకు పైగానే సొమ్ము స్వాహా అయినట్లు తెలుస్తోంది. పెద్ద ఎత్తున అవినీతి జరిగిప్పటికీ ఉన్నతాధికా రులకు తెలియకుండా కిందిస్థాయిలోనే వ్యవహారాన్ని సద్దుమణిచేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. వ్యవహారం బయటకు పొక్కకుండా యానిమేటర్‌కు గడువు ఇప్పించి నడిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళల పొదుపు సొమ్ము స్వాహాలో అధికారుల పాత్ర కూడా ఉందేమోనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పోలీసులకు ఫిర్యాదు..

స్వాహా చేసిన సొమ్ము చెల్లించేందుకు యానిమేటర్‌కు ఇచ్చిన గడువు ముగియడంతో సోమవారం గ్రీవెన్స్‌లో పోలీసు ఉన్నాతాధికారులకు పలువురు గ్రూపు సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇటుకలపల్లి పోలీ సులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. గురువారం కూడా ఇద్దరు, ముగ్గురు మహిళలు తమ సొమ్ము స్వాహాపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొన్ని నెలల కిందట మండలంలోని రాచానపల్లిలోను ఇలాంటి సంఘటనే జరిగింది. ఉన్నతాధికారులు పర్యవేక్షించడంతోపాటు కఠన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందనే చర్చ సాగుతోంది.

స్వాహా నిజమే: రవి, ఏంపీఎం, అనంతపురం రూరల్ మండలం



ఆకుతోటపల్లి గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలకు సంబంధించి న సొమ్మును గతంలో పని చేసిన యానిమేటర్ తన సొంత ఖాతాలోకి జమ చేసుకున్న విషయం వాస్తవమే. సొమ్ము తన ఖాతాలోకి పడేటట్లు తీర్మానం చేసుకుని, ఆ కాపీని బ్యాంకులో ఇచ్చి, ఆమేరకు తన పరిధిలోని సంఘాల మహిళలకు సంబంధించిన సొమ్మును స్వాహా చేసింది. మా విచారణలో రూ.20లక్షల వరకు యానిమేటర్ గ్రూపు సభ్యులకు తెలియకుండా తీసుకుంది. ఇటీవల మరికొంత మంది తమ సొమ్మును యానిమేటర్ తీసుకుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ లెక్కలు మాదాక రాలేదు. మా దృష్టికి వచ్చిన మేరకు ఆ యానిమేటర్‌తో సొమ్ము రికవరీ చేయిస్తున్నాం. ఇప్పటి వరకు రూ.5లక్షల దాకా చెల్లించారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ధర్మవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని బాస్కెట్‌బాల్ క్రీడామైదానంలో గురువారం బాల, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయ్‌భాస్కర్, ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ హిదయ్‌తుల్లా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన జట్లు త్వరలో జోనల్ స్థాయిలో తిరుపతిలో జరిగే బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటాయన్నారు.

జట్ల వివరాలు..


బాలికల జట్టు: కిరణ్మయి, నిఖ్య, అలేఖ్య, అంజన, యశశ్విని, శరణ్య, ప్రియదీప్తి, మనిత, ఇంద్రజ, కేతన, మౌనిక, వైష్ణవి.

బాలుర జట్టు: విజయ్‌తరుణ్, మంజునాథ్, కార్తీక్‌నాయక్, అశోక్, లక్ష్మీనారాయణ, సాయికుమార్, యేసు, నాగేంద్ర, చైతన్యసాయి, పంతోఫ్, అబ్దుల్, రోనంక్.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి (జయంతి)



జంట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి 1870 ఆగస్టు 8న తూర్పు గోదావరి జిల్లా కడియంలో జన్మించారు. తెలుగు కవి, అవధాని, నాటక కర్త. తెలుగు సాహిత్యంలో దివాకర్ల తిరుపతిశాస్త్రి, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి తిరుపతి వేంకట కవులుగాను, జంట కవులుగాను పేరొందారు. వీరిద్దరూ ఇంచుమించుగా వంద సంస్కృత, తెలుగు గ్రంథాలు, నాటకాలు, అనువాదాలు రాశారు. అవధానాల్లో వీరి పాండిత్యం, ప్రతిభ, చమత్కార చాతుర్యం సాహితీ సమాజంలో తరతరాలుగా చెప్పుకొనబడుతున్నాయి. పాండవోద్యోగ విజయములు నాటకంలోని పద్యాలు ఊరూరా మారుమోగాయి. కళా ప్రపూర్ణ పురస్కారం అందుకున్నారు. 1950లో కన్నుమూశారు.

జీన్ డీచ్ (జయంతి)




యూజీన్ మెర్రిల్ డీచ్ 1924 ఆగస్టు 8న అమెరికా దేశం చికాగోలో జన్మించారు. ఆస్కార్ అవార్డు పొందిన ఇల్లుస్ట్రేటర్‌గా, యానిమేటర్‌గా, కామిక్ ఆర్టిస్ట్‌గానే కాక సినీ దర్శకుడిగా రాణించారు. మున్రో, టామ్ టెర్రిఫిక్, నుడ్నిక్, పొపెయ్, టామ్ అండ్ జెర్రీ సిరీస్ ఎంతో పేరుతెచ్చాయి. టెర్రిటూన్స్‌లో క్రియేటివ్ డైరెక్టర్‌గా సిడ్నీ ది ఎలిఫెంట్, గ్యాస్టన్ లి క్రేయాన్, టామ్ టెర్రిఫిక్, క్లింట్ రాబర్ క్యారెక్టర్‌లను సృష్టించారు. ఇవి అకాడమీ అవార్డుకు నామినేట్ అయ్యాయి. 2020 ఏప్రిల్ 16న కన్నుమూశారు. 2021లో టామ్ అండ్ జెర్రీ సినిమా ఆయన జ్ఞాపకార్థం అంకితం చేయబడింది.

కపిల్ సిబల్ (పుట్టినరోజు)



కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలలో ఒకరైన కపిల్ సిబల్ 1948 ఆగస్టు 8న పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జన్మించారు. కేంద్రంలో యూపీఏ హయాంలో కేంద్రమంత్రిగా వివిధ హోదాలలో కొనసాగారు. వృత్తిరీత్యా న్యాయవాది కావడంతో న్యాయశాఖ, ఐటి కమ్యూనికేషన్స్, మానవ వనరుల విభాగాల మంత్రిగా వ్యవహరించారు. 1998లో రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ అయ్యారు. అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా హోదాలోనూ, సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మూడుసార్లు వ్యవహరించారు. 2022లో రాజ్యసభకు నామినేట్ అయ్యారు. కాగా సాహిత్యంపై ఆసక్తితో కొన్ని హిందీ సినిమాలకు పాటలు రాశారు.

రోజర్ ఫెదరర్ (పుట్టినరోజు)



స్విస్ దేశానికి చెందిన టెన్నిస్ క్రీడాకారుడు రోజర్ ఫెదరర్ 1981 ఆగస్టు 8న జన్మించారు. ప్రపంచస్థాయిలో అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ)చే పురుషుల సింగిల్స్‌లో 9వ ర్యాంకులో నిలిచారు. 20 గ్రాండ్‌స్లామ్ సింగిల్ టైటిల్స్‌ను సాధించిన మూడో వ్యక్తి. డబుల్స్‌లో ఇంతవరకు 8 టైటిల్స్ సాధించారు. స్టెఫాన్ ఎడ్‌బర్గ్ స్పోర్ట్స్‌మన్ షిప్ అవార్డు 13సార్లు అందుకోగా బీబీ ఓవర్సీస్ స్పోర్ట్స్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్‌ను నాలుగుసార్లు సాధించారు. 310 వారాలపాటు వరల్డ్ నెంబరు వన్‌గా కొనసాగడం విశేషం. అత్యధిక ఆదాయం కల్గిన అథ్లెట్‌లో ఒకరిగా ఉన్న ఆయన సేవాకార్యక్రమాలతో మానవతావాదిగాను గుర్తింపు పొందారు. లేవర్ కప్ తర్వాత 2022 సెప్టెంబరులో టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు.

మీరాబాయి చాను (పుట్టినరోజు)



జాతీయస్థాయిలో వెయిట్‌లిఫ్టర్‌గా పేరొందిన సైఖోమ్ మీరాబాయి చాను 1994 ఆగస్టు 8న మణిపుర రాష్ట్రం ఇంఫాల్ తూర్పు ప్రాంతంలో జన్మించారు. 2014 కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 48 కిలోల విభాగంలో రజత పతకం సాధించారు. టోక్యో 2020 సమ్మర్ ఒలింపిక్స్‌లో రజతపతకం సాధించారు. ఒలింపిక్స్‌లో 115 కిలోల క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో తనదైన రికార్డుల నెలకొల్పారు. కరణం మల్లీశ్వరి తర్వాత ఒలింపిక్ పతకం సాధించిన రెండో మహిళగా రికార్డు నమోదు చేశారు. 2018లో రాజీవ్ ఖేల్‌రత్న, 2019లో పద్మశ్రీ అందుకున్నారు. 2022 కామన్వెల్త్ పోటీల్లో మొత్తం 201 కిలోలు ఎత్తడం ద్వారా బంగారు పతకం సాధించారు. ప్రస్తుతం 2024 పారిస్ ఒలింపిక్స్‌లో 49కేజీల విభాగంలో పాల్గొన్నారు.

లాల్‌బాగ్‌లో సందడే సందడి..!

లాల్‌బాగ్‌లో పూల ప్రదర్శనను సందర్శించడానికి నగరవాసులు తరలి రావడంతో గురువారం సందడి నెలకొంది



లాల్‌బాగ్‌లో ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు



మహనీయులకు సీఎం పుష్పాంజలి



విద్యార్థుల సందడి



వీర వనిత ఒణికె ఓబవ్వ

నేడు కాంగ్రెస్ ఓట్ అధికార్ ర్యాలీ

బెంగళూరు, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ఓట్ల చౌర్యం జరిగిందని ఆరోపణలు చేసిన లోక్‌సభ ప్రతిపక్షనేత ఆదేశాల మేరకు బెంగళూరులో భారీ నిరసనకు వేదిక సిద్ధమైంది. దేశంలోనే ఓట్ల చౌర్యంపై జరుగుతున్న తొలి నిరసన కావడంతో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇదే వేదిక నుంచి రాహుల్‌గాంధీ చేసే ఆరోపణలు మరింత కీలకంగా ఉంటాయని పార్టీ ముఖ్యనేతలు భావిస్తున్నారు. రాహుల్‌గాంధీ ఆరోపణలు చేసిన మహదేవపుర నుంచి కేఆర్ సర్కిల్‌లోని ఎన్నికల కమీషన్ కార్యాలయం దాకా పాదయాత్ర చేయాలని ముందుగా భావించారు. కానీ పాదయాత్ర వలన ట్రాఫిక్ సమస్యతో పాటు ఇతరత్రా ఇబ్బందులు తలెత్తుతాయని ఇంటిలిజెన్స్ పోలీసులు సూచనల మేరకు కేవలం ఫ్రీడం పార్కులో నిరసన చేపట్టనున్నారు. ఢిల్లీ నుంచి రాహుల్‌గాంధీ ప్రత్యేక విమానంలో హెచ్ఏఎల్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్‌గా ఫ్రీడంపార్కు వేదిక వద్దకు వస్తారు. దీ బెంగళూరులో శుక్రవారం కాంగ్రెస్ ఓట్ అధికార్ ర్యాలీగా పార్టీ నిర్ణయించింది. ఫ్రీడంపార్కులో దాదాపు పదిరోజులుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. తొలుత 5వతేదీ నిరసన చేయాలని నిర్ణయించినా జార్ఖండ్‌నేత శిబుసోరన్ మృతితో వాయిదా వేశారు. పాలకులంతా బెంగళూరు సభపైనే దృష్టి సారించారు. మూడురోజులుగా డీసీఎం డీకే శివకుమార్, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రణదీప్ సింగ్ సూర్జేవాల బెంగళూరులోనే మకాం వేసి పర్యవేక్షిస్తున్నారు. ఫ్రీడం పార్కులో వేలాది మంది కూర్చొనేందుకు వీలుగా సిద్ధం చేశారు. వాతావరణంలో మార్పులుఉన్నందున వర్షం వచ్చినా ఇబ్బంది ఉండకూడదనేలా ఏర్పాట్లు చేశారు. బెంగళూరు నగరాన్ని మినహాయించి 11 జిల్లాల నుంచి ఎక్కువ మంది కార్యకర్తలను తీసుకువచ్చేలా ఇన్‌ఛార్జ్ మంత్రులకు ఆదేశించారు. మరోవైపు ప్రతి జిల్లా నుంచి ముఖ్యనేతలందరూ వచ్చేలా రాష్ట్ర పార్టీ ఆదేశించింది. వారం రోజులుగా సీఎం సిద్దరామయ్య కూడా రాహుల్‌గాంధీ వద్ద సాక్ష్యాలు ఉన్నాయని వాటిని బహిరంగం చేస్తారంటూ ప్రకటిస్తూ వచ్చారు. కేపీసీసీలోని భారత్ జోడో భవన్ వారంంరోజులుగా సభలు, సమీక్షలతో సందడిగా మారింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జ్‌లకు కార్యకర్తలను తీసుకువచ్చేందుకు పలు మార్గదర్శకాలు చేశారు. ఇప్పటికే ప్రాంతాల వారీగా ప్రత్యేక బస్సులు, ఇతరత్రా వాహనాలు సమకూర్చారు. ఉత్తరకర్ణాటక, తీరప్రాంత జిల్లాల నుంచి గురువారం మధ్యాహ్నామే బయలుదేరారు. వేలాది మంది పాల్గొంటున్నందున వారికి తగిన ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. పార్టీకి చెందిన వివిధ రాష్ట్రాల నేతలు బెంగళూరుకు చేరుకుంటున్నారు. మధ్యాహ్నం సభ ముగిశాక రాహుల్‌గాంధీతో పాటు ఇతర నేతలు సమీపంలోనే ఉండే ఎన్నికల కమిషన్ కార్యాలయానికి చేరుకుని వినతిని ఇవ్వనున్నారు. అయితే రాష్ట్రమంతటా వరమహాలక్ష్మి పండుగ జరుపుకుంటుండటంతో మహిళలు ఎక్కువగా వచ్చేది అనుమానమే అనిపిస్తోంది.



విద్యుత్ దీపాల ఏర్పాటు

ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి

ఓటరు చౌర్యంపై నిరసన చేపడుతున్న తరుణంలోనే గురువారం మధ్యాహ్నం హుటాహుటిన ఢిల్లీకు బయలుదేరారు. మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత నేరుగా ఢిల్లీ వెళ్లారు. పలువురు కేంద్రమంత్రులను కలిసేందుకు వెళ్తున్నట్లు సీఎంఓ ప్రకటించింది. రాహుల్‌గాంధీతో పాటు మల్లికార్జునఖర్గే వంటినేతలు మరికొన్ని గంటలలోనే బెంగళూరుకు వస్తుండగా సీఎం ఢిల్లీ వెళ్ళారు. రాత్రి పొద్దుపోయాక వెనుదిరిగి వస్తున్నారు.

పైకప్పు కూలి అంగన్‌వాడీ కార్యకర్తకు గాయాలు



పైకప్పు కూలి ధ్వంసమైన వస్తువులు

రాయచూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అరకెరా తాలూకా అల్దర్తి గ్రామంలో అంగన్‌వాడీ భవనం పైకప్పు కూలి కార్యకర్త మహాదేవమ్మ గాయాల పాలైంది. గురువారం ఉదయం అంగన్‌వాడీలో ఉన్న పిల్లలంత బయటికి వెళ్లి ఆడుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం జరగడంతో బాలలెవ్వరికి ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. అకస్మాత్తుగా సీలింగ్ పై పెచ్చులు కూలిపడడంతో అక్కడే పని చేసుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్త తల పై పడడంతో మూర్ఛవచ్చి పడిపోయింది. వెంటనే గ్రామస్థులు ఆమెను చికిత్స కోసం దేవదెఉర్గ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విషయం తెలుసుకున్న పీడీఓ, దేవదుర్గ, గబ్బూరు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ భవనం పూర్తి శిథిలమై ప్రమాదకరంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆరోపించారు. పిల్లలు లేని సమయంలో పడడంతో ప్రమాదం తప్పిందనీ, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదురయ్యేవని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నుజ్జయిన బొలెరో వాహనం

నల్లచెరువు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలకేంద్రంలోని సంత తోపు వద్ద గురువారం గ్యాస్ లారీని బొలేరో వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. మదనపల్లి వైపు నుంచి బొలేరో వాహనం గ్యాస్ ఫుల్ సిలిండర్లతో కదిరి వైపు వస్తోంది. తనకల్లుకు వెళ్తున్న లారీని నల్లచెరువు సంత తోపు వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌బళ్లాపూర్ దిబ్బరహళ్లికి చెందిన బొలేరో వాహనం డ్రైవర్ బీఎన్. వెంకటకుమార్ (30) అక్కడిక్కడే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బుక్‌బ్రహ్మ సాహితీ ఉత్సవాలకు సిద్ధం

బెంగళూరు, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత స్థాయి బుక్‌బ్రహ్మ సాహితీ ఉత్సవాలు శుక్రవారం నుంచి కోరమంగళలోని సెయింట్ జాన్ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉండే ఆడిటోరియంలో జరుగనుంది. ఏటా సాహితీ ఉత్సవాలు జరుపుతున్న విషయం తెలిసిందే. తెలుగు, కన్నడ, తమిళ, మళయాలంకు సంబంధించి అతిపెద్ద సాహితీ ఉత్సవానికి భారీగా ఏర్పాట్లు చేశారు. మూడురోజులకు సంబంధించి పలు భాషల పుస్తకాల విడుదలతో పాటు భిన్నమైన అంశాలపై చర్చాగోష్టిలు జరుగనున్నాయి. కార్యక్రమాల నిర్వహణకు మంటప, మథన, అక్షర, అంగళ, ముఖాముఖి, అనావరణ, పుస్తక, చిన్నారలోక పేరుతో ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేశారు. వందలాది మంది సాహితీవేత్తల పాల్గొనే ఉత్సవాలలో భాగస్వామ్యులయ్యేందుకు ఇప్పటికే వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు విచ్చేశారు. శుక్రవారం బుక్‌బ్రహ్మ సాహితీ ఉత్సవాలు ప్రారంభం కానుండగా మధ్యాహ్నం సింగారవ్వ ఏకపాత్రాభినయం ప్రదర్శన మధ్యాహ్నం 2గంటలకు ఉంటుంది. 9న శనివారం ఉదయం 8.30గంటలక పండిట్ ప్రవీణ్‌గోడ్కండి సంగీత కార్యక్రమం, మధ్యాహ్నం 2గంటలకు సాంగ్ ఆఫ్ రివర్స్ అండ్ రెయిన్ సంగీతం మానస ప్రసాద్ బృందం నిర్వహించనుంది. 10వ తేదీ ఆదివారం ఉదయం 8.30గంటలకు పండిట్ గణపతి భట్, పండిట్ వ్యాసమూర్తికట్టి, పండిట్ శ్రీధర్ మండ్రేల సంగీత కార్యక్రమం, మధ్యాహ్నం 2గంటలకు రామేశ్వరం కాకులు నాటిక ప్రదర్శన ఉంటుంది. అదేరోజు సాయంత్రం బెంగళూరు క్లబ్ ఆఫ్ కథాకళి దుర్యోధన వధం యక్షగాన ప్రదర్శనలు ఉంటాయి.

నేటి నుంచి ఆర్మీ ర్యాలీ



కేంద్రానికి చేరుకున్న అభ్యర్థులు

రాయచూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో నేటి నుంచి (8వ తేదీ నుంచి 26వ తేదీ వరకు) జరిగే సైనిక భర్తీ కోసం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లాధికారి కే నితీశ్ తెలిపారు. ర్యాలీకి హాజరైయ్యే అభ్యర్థులకు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు. ఇందు కోసం వివిధ చోట్ల అభ్యర్థులకు బస, వ్యవసాయ విశ్వ విద్యాలయం వద్ద అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం అందుబాటులో ఉంచామన్నారు. ఇందు కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి ఆయా విభాగాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి రోజు 860 మంది అభ్యర్థులు ర్యాలీకి హాజరైయ్యే అవకాశం ఉందని మొత్తం 18 రోజుల పాటు జరిగే సైనిక భర్తీ ర్యాలీలో బెళగావి,బీదర్,కలబుర్గి,కొప్పళ,యాదగిరి,రాయచూరు జిల్లాల నుంచి 15000 మంది అభ్యర్థులు హాజరు కానుండగా వారికి తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ర్యాలీలో పాల్గొన్న అభ్యర్థులు సెంట్రల్ బస్ స్టేషన్ నుంచి, రైల్వే స్టేషన్ నుంచి తాము బస ఉండే వసతి నిలయాలకు వెళ్లేందుకు ప్రత్యేక రవాణా బస్సులను అందుబాటులో ఉంచామన్నారు. ఇందుకు కేవలం రూ.10 టికెట్‌గా నిర్ణయించి వారికి రవాణా సదుపాయం కల్పించామన్నారు.

మూటలో కాళ్లు, చేతులు



ప్లాస్టిక్ సంచిని పరిశీలిస్తున్న పోలీసులు

బెంగళూరు, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హోంమంత్రి పరమేశ్వర్ ప్రాతినిథ్యం వహిస్తున్న తుమకూరు జిల్లా కొరటగెరెలో దారుణహత్య జరిగింది. తాలూకా పరిధిలోని చింపుగానహళ్ళి శివారులో రోడ్డుపక్కన ప్లాస్టిక్ కవర్‌లలో చేతులు, కాళ్ళను పడేశారు. గురువారం రాత్రి పొద్దుపోయాక పడేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. రెండు కాళ్ళను ప్రత్యేకంగా చేసి మూట తరహాలో కట్టి రోడ్డుపక్కన వేశారు. సుమారు కిలోమీటర్ దూరంలో మరో చోటున చేతులు ఉండే కవర్ లభించింది. ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొరటగెరె సీఐ అనిల్, ఎస్ఐ తీర్థేష్ బసవరాజు తదితరులు సంఘటనాస్థలాన్ని సందర్శించారు. ప్లాస్టిక్ సంచులను సేకరించి ఆసుపత్రికి తరలించారు. మృతదేహం మహిళదిగా అనుమానిస్తున్నారు.

నా ప్రేయసికి నేనంటే ప్రాణం

- ఈ కేసులో ఆమెను చేర్చకండి ప్లీజ్
- డెత్‌నోట్ రాసి.. యువకుడి ఆత్మహత్య



యశ్వంత నాయక్

బెంగళూరు, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ప్లీజ్.. ఈ కేసులో నా ప్రియురాలిని తీసుకురాకండి అంటూ డెత్ నోట్ రాసిపెట్టి దావణగెరె జిల్లా న్యామతి తాలూకా మాచిగొండనహళ్ళికు చెందిన యశ్వంత నాయక్ (24) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. యశవంత నాయక్ తల్లి చేసిన ఫిర్యాదుతో పాటు డెత్‌నోట్‌లోని అంశాలను పోలీసులు మీడియాకు తెలిపారు. అప్పుల బాధను భరించలేక పోతున్నానని అందరూ అనుకున్నట్లుగా డబ్బులు పాడు చేయలేదని అందులో రాశాడు. ప్రియురాలిని వివాదంలోకి తీసుకురాకూడదని తనపైనే ఆమె ప్రాణం పెట్టుకున్నట్లు రాసినట్లు తెలిపారు. శివమొగ్గలోని ఓ ఫైనాన్స్‌లో 5 లక్షలు అప్పు తీసుకోగా వారు ఇల్లు జప్తు చేస్తామని బెదరించారన్నారు. శివమొగ్గకు చెందిన ఓ వ్యక్తికి బైక్ తాకట్టు పెట్టి రూ.40వేలు తీసుకున్నట్లు రాశారన్నారు. ఇలా అప్పుల వారు ఇంటి వద్ద గొడవకు వస్తే అవమానం జరుగుతుందనే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాశారన్నారు. ఉరివేసుకుని యశవంతనాయక్ ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. న్యామతి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రావమ్మా.. మహాలక్ష్మీ



గాంధీబజార్‌లో..

(మొదటిపేజీ తరువాయి)

పూలు, పత్రులు, అరటి పిలకలు, తామరపుష్పాలతో పాటు వివిధ రకాల పండ్లు వచ్చాయి. వరమహాలక్ష్మిని వివిధ రూపాల్లో అలంకరించి వ్రతం ఆచరిస్తారు. బెంగళూరు వ్యాప్తంగా పండుగ వాతావరణం కనిపిస్తోంది. ఎక్కడ చూసినా విక్రయాలు సాగాయి. ప్రత్యేకించి కేఆర్ మార్కెట్‌లో కనీసం 30-50వేల మందికి పైగా ప్రజలు కొనుగోళ్ళకు వచ్చారు. ఇక గాంధీబజార్, మడివాళ, జయనగర్, జేపీనగర్, యలహంక, ఆర్‌టీనగర్, కేఆర్‌పుర మార్కెట్‌లు సందడి అనిపించాయి. మైసూరు, మండ్య, మంగళూరు, ఉడుపి, బెళగావి, బాగల్‌కోట, హావేరి, ధారవాడ, హుబ్బళ్ళి, చిక్కబళ్ళాపుర, కోలార్‌లలోను భారీగా వ్యాపారాలు సాగాయి. ప్రత్యేకించి పూలధరలు అమాంతంగా పెరిగాయి. కనకాంబరాలు కిలో రూ.3000లకు పైగా పలికాయి. మల్లెపూలు కేజీ రూ.1600 కాగా చామంతులు, చెండుమల్లెలు ఇతరత్రా పూలు 200-300ల దాకా ధరల ఉన్నాయి. అరటిపండ్లు యాలక్కి కేజీ రూ.150-200 సాధారణ అరటిపళ్ళు రూ.50-80లు కాగా యాపిల్ కేజీ 250లుగాను దానిమ్మ 200లకు పైగానే ధరలు ఉన్నాయి. కూరగాయల ధరలు పెరిగాయి.





పూలు, గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,632.50
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	23,788	84,696
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	23,430	55,696
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	102.34

అంతర్గత రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే

● ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సహించేది లేదు ● 11 నుంచి బెంగళూరులో భారీ నిరసన: పోరాట కమిటీ ప్రకటన

బళ్లారి సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షాకాల సమావేశాల్లో రాష్ట్రంలో అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ షెడ్యూల్డ్ కులాల అంతర్గత రిజర్వేషన్ పోరాట కమిటీ ఆగస్టు 11నుంచి బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్ వద్ద నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. గురువారం కమిటీ నాయకుడు కరియప్ప గుడిమణి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంతర్గత రిజర్వేషన్ల కోసం డిమాండ్, పోరాటం గత కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్య అన్నారు. ఆగస్టు1న సుప్రీంకోర్టు తీర్పు షెడ్యూల్డ్ కుల జాబితాలోని 101 వర్గాలకు వారి జనాభా ప్రకారం అంతర్గత రిజర్వేషన్లు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాలను స్పష్టంగా ఆదేశించినప్పటికీ కర్ణాటక ప్రభుత్వం ఈసుప్రీం కోర్టు తీర్పు అమల్లో అనవసరంగా జాప్యం చేస్తోందన్నారు. ఇది ఎస్సీ సమాజంలో తీవ్ర అసంతృప్తికి కారణమయ్యిందన్నారు. సుప్రీంకోర్టు తరువాత హర్యానా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అంతర్గత రిజర్వేషన్లను అమలు చేసే సామాజిక న్యాయం విషయంలో కొత్త ప్రమాణాన్ని నిర్దేశించాయి. కర్ణాటక ప్రభుత్వ జాప్యం విధానం షెడ్యూల్డ్ కులాల్లో ముఖ్యంగా మాదిగలు, 29ఉప కులాలలో తీవ్ర ఆగ్రహానికి దారితీస్తోందన్నారు. నాగమోహన్ దాస్ నివేదికపై గందరగోళం, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి గురించి హెచ్చరికలు జారీ చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంతర్గత రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న అంతర్గత రిజర్వేషన్ కమిటీ సభ్యులు



భూమిపూజలో పాల్గొన్న నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

బళ్లారి సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులకు నగర ఎమ్మెల్యే భరత్‌రెడ్డి గురువారం భూమి పూజ చేశారు. వార్డు నెంబర్ 35లోని సత్యవాణి నగరల్ రూ. 20లక్షల వ్యయంతో అంగన్‌వాడీ సెంటర్ పనులకు భూమిపూజ చేశారు. అదేవిధంగా కరిమారెమ్మ కాలనీలో రూ.20లక్షల వ్యయంతో అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణానికి, రూ.20లక్షల వ్యయంతో కోలచలం కాంపౌండ్ రోడ్డు, వీధి దీపాల ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. పలు పనుల అంచనా సమారు రూ. 1కోటీ 2లక్షలు ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. ఈసందర్భంగా కార్పోరేషన్ సభ్యులు మించు శ్రీనివాసులు, ఎం.ప్రభంజన్‌కుమార్, కుబేర, కాంగ్రెస్ నాయకులు ఎల్.మారెన్న, ఎరుకుల స్వామి, సిద్దేశ్, రవి, సంతక్ష్ తదితరులున్నారు.



దేవలాపురం వద్ద పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ

పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ

కంప్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని దేవలాపురం వద్ద లోడుతో ఉన్న లారీ పొలాల్లోకి వెళ్లింది. కంప్లి వైపు నుంచి బళ్లారి వైపు లోడుతో వెళుతున్న లారీ దేవలాపురం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని సైడ్ ఇవ్వబోయి అదుపుతప్పి వెళ్లింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం కలుగలేదు. లారీ డ్రైవర్ అప్రమత్తంగా వుండటంతో ఎదురుగా వస్తున్న పశువుల్ని ఎలాంటి నష్టం కలగకుండా చాకచక్యంతో లారీని సైడ్ తీసుకున్నారు. రోడ్డుకి గొంతు భాగంలో వుండటంతో లారీ పొలంలోకి వెళ్లింది.

రేపు పంచాయతీ కార్యాలయం ప్రారంభం



తాలుకా పంచాయతీ కార్యాలయం

కంప్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : కంప్లి పట్టణంలోని హోస్పేట రోడ్డులో రూ. 1.60 కోట్లతో జిల్లా పంచాయతీ నిధులతో నూతనంగా నిర్మించిన తాలుకా పంచాయతీ కార్యాలయం శనివారం ప్రారంభమవుతున్నట్లు తాలుకా ఈఓ శ్రీకుమార్ తెలిపారు. గతంలో తాలుకా పంచాయతీ కార్యాలయం లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ సిబ్బంది తాము విధులు నిర్వహించామన్నారు. తాము పడుతున్న ఇబ్బందులు నియోజకవర్గ ఎమ్మెల్యే దృష్టిలో వుంచుకుని నూతన కార్యాలయానికి నిధులు మంజూరు చేసి నూతన కార్యాలయం ఏర్పాటు చేశారన్నారు. ఇది నూతన కార్యాలయంలో అన్ని వసతులు కలిగి వున్నాయని తెలిపారు. ఈ ప్రారంభానికి జిల్లాలోని జిల్లా పంచాయతీ తాలుకా పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే గణేష్ ఆధ్వర్యంలో ఈ కార్యం ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు కార్యక్రమంలో పాల్గొని తెలిపారు.

సండూరులో భారీ వర్షం

తోరణగల్లు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకాలో రెండు రోజులుగా భారీ వర్షపాతం నమోదైంది. సండూరు ప్రాంతంలో 91.2 మిల్లీమీటర్ల వితలాపురం ప్రాంతంలో 78.6 మిల్లీమీటర్లు కురేకుప్ప ప్రాంతంలో 19.5 మిల్లీమీటర్లు అలాగే చోర్నూరు ప్రాంతంలో 102.8 మిల్లీమీటర్లు నమోదైనట్లు అధికారులు తెలియజేశారు.

కిక్కిరిసిన మార్కెట్లు

తోరణగల్లు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వరమహాలక్ష్మీ పూజ సందర్భంగా గురువారం మార్కెట్లు కిటకిటలాడాయి. పూలు, పండ్లు కొనుగోళ్లతో దుకాణాలు జనసందడి నెలకొంది. తాలుకా వ్యాప్తంగా శుక్రవారం వరమహాలక్ష్మీ పూజను ఘనంగా నిర్వహిస్తున్నారు. ధరలు సామాన్యులకు అందుబాటులో లేవని, భారీగా పెంచేశారని పలువురు వాపోయారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



చేనేతకార్మికులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కేసీ కొండయ్య

బళ్లారి సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బళ్లారి చేనేత ఉత్పత్తుల సంఘం ఆధ్వర్యంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా ఆచరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ కేసీ కొండయ్య మాట్లాడుతూ చేనేతల సమస్యలను అందరూ కలిసి కట్టుగా పరిష్కరించుకుందామన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వంతో కలిసి పోరాడుదామన్నారు. చేనేతను ప్రోత్సహించడానికి అందరూ నడుం కట్టాలన్నారు. ఆధునిక వస్త్రాలు ఎన్నున్నా చేనేత వస్త్రాలను ఆదరించాలన్నారు. అనంతరం 50మంది చేనేత కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు రామకృష్ణప్రముఖులు విరూపాక్షప్ప, మంజునాథ్, మంజుళ, జౌళి అధికారులు మంజునాథ్, మురళి,రంగస్వామి,వీరస్వామి, రంగమ్మ, చేనేత సమాజ బాంధవులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



సిరుగుప్ప, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : కన్నుల పండువగా లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరుగుప్ప పట్టణం 19వ వార్డులో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అర్చకులు స్వాముల వారికి గంగాజలాభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మహామంగళహారతి చేపట్టారు. భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

ఆఫీస్ బేరర్లతో ఏఈఈ సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

హోస్పేట,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి):స్లమ్ బోర్డు కార్యాలయంలో ఏఈఈ తిమ్మన్న అధ్యక్షతన స్లమ్ పీపుల్స్ ఆర్గనైజేషన్ కర్ణాటక ఆఫీస్ బేరర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. మురికివాడ నివాసితులందరికిటైటిల్ డీడ్‌లను జారీ చేయడం రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతినపూర్తి చేయడం మురికివాడలనివాసితుల కోసం 25 నుంచి 30 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి అర్హుక్కడ స్థలాలను అందించాలి. పీఎంఏవై ఫేజ్1లో నిర్మించిన సగం నిర్మించిన ఇళ్లనుపూర్తి చేయాలి. స్థానిక శాసనసభ్యులతో మాట్లాడిన తర్వాత వచ్చే వారం నుంచి వారానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియనుప్రారంభించాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో ఏఈ శివకుమార్, సంస్థ జిల్లా అధ్యక్షుడు హెచ్ శేషు, ప్రధానకార్యదర్శి ఎన్ వెంకటేష్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు హులిగెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతును ముంచిన నారాహల్లి



వరద నీటిలో మునిగిన పొలం

బళ్లారి, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బళ్లారి జిల్లా సండూరు వద్ద ఉన్న నారాహల్లి జలాశయానికి వరద భారీగా చేరుతోంది. జలాశయంకు ఉండే తూములు ఎత్తి నీరు కిందకు వదిలేశారు. దీంతో సమీపంలో ఉండే కురుకుప్ప గ్రామంలో పంటపొలాలు మునిగిపోయాయి. కురేకుప్ప వద్ద పొలాల్లోకి నీరు చేరుతోంది. దాదాపు 60 కుటుంబాలకు చెందిన రైతుల పొలాల్లో 200 ఎకరాల్లో పంట నీట మునిగింది. మొక్కజొన్న, పత్తి, వరి, కూరగాయలు పంటలు మునిగిపోయాయి. పంటలు నీట మునిగి నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయ పంటలు పూర్తిగా నష్టం వాటిల్లింది. సమీపంలో ఉన్న చెరుకు పంట కూడా నీటమునిగిపోవడంతో రైతులకు అపారనష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో ఉండే గ్రామంలోకి నీరు చేరడంతో గ్రామం నీటితో జలదిగ్బంధం అయింది. రాకపోకలు పూర్తిగా స్తంభించాయి.



దెబ్బతిన్న మొక్కజొన్న పంట

'యువనిధి'పై అవగాహన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

హోస్పేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):యువతను ప్రోత్సహించడానికి యువనిధి పథకం ద్వారా వివిధ నైపుణ్య ఆధారిత శిక్షణను అందించడానికి, స్వావలంబన జీవితాన్ని నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం యువ నిధి ప్లస్ పథకాన్ని అమలు చేసిందని యువతీ,యువకులు సద్వినియోగం చేసుకోవాలని హామీపథకం అమలుప్రాధికార సంస్థ జిల్లా అధ్యక్షుడు కురి శివమూర్తి అన్నారు. గురువారం టమ్స్ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ,నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత, జీవనోపాధి విభాగం నిర్వహించిన యువనిధి ప్లస్‌పథకాలపై ఒక వర్క్‌షాప్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తఆలోచనలతో యునిధి ప్లస్‌ను ప్రాంబించింది.

అమ్మ సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం



ఆసుపత్రిలో అన్నదానం చేస్తున్న దృశ్యం

తోరణగల్లు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) :ఎన్నో సహాయ కార్యక్రమాలు చేపడుతున్న సండూరు తాలుకా తాళ్లూరు గ్రామానికి చెందిన అమ్మ సంస్థ గత 48 వారాలుగా వారం వారం అన్నదాసోహ కార్యక్రమాన్ని తోరణగల్లు ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు. ఈ 49వ వారం కూడా అన్నదాసోహ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన బాధితులకు ఇతరులకు అమ్మసంస్థ వారు ఈ సేవలు అందిస్తున్నారు. ఈ సేవలు అందుకుంటున్న అందరూ అమ్మసంస్థను ప్రశంసిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మ సంసస్థ పదాధికారులైన కవిత రుద్రగౌడ, రుద్రగౌడ, మణికంఠ హాస్పిటల్ సిబ్బంది మొదలగువారు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

● ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ ఖాసీం



మాట్లాడుతున్న ప్రధాన వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ ఖాసీం

సిరుగుప్ప, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని వైద్యులు డాక్టర్ మహమ్మద్ ఖాసీం అన్నారు. గురువారం సిరుగుప్ప పట్టణం విద్యాశాఖ, ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో బాల్యవివాహాలను అరికట్టడం, బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఖాసీం మాట్లాడుతూ పిల్లలకు 18 యేళ్లలోపు వివాహాలు చేయడం చట్టరీత్యానేరమన్నారు. పిల్లలను బడులకు పంపాలన్నారు. అలాగే పిల్లలతో కార్మికులుగా చేయరాదన్నారు. కార్యక్రమంలో డీఆర్పీ వీరేష్, ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

రైతు శిబిరాలపై గ్రామాల్లో ప్రచారం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఐకేకేఎంఎస్ సభ్యులు

బళ్లారి సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మూడు రోజులపాటు జరుగు రైతు శిబిరం గురించి తాలూకాలోని ముద్దటనూరు గ్రామంలో ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం రైతు శిబిరం గురించి ప్రచారం చేపట్టింది. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి గురల్లిరాజా మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారాలను చర్చించడానికి సెప్టెంబర్ 16,17,18 తేదీల్లో మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి రైతు వ్యవసాయ కార్మిక శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈశిబిరంలో రైతుల పంటలకు మద్దతు ధరలు ఎందుకు రావడం లేదు, విత్తనాలు , ఎరువుల ధరల పెరుగుదలపై అవగాహన చేపడ్తామన్నారు. పలు సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి మనం ఏమి చేయాలి వంటి అనేక అంశాలను చర్చించారు. తాలూకాలోని రైతులందరూ ఈ బిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో పాల్గొనడానికి 9972690319, 974994490 నంబర్లకు కాల్ చేయవచ్చని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో రైతులు చంద్రప్ప, చిదానందప్ప, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు నిబంధనలు పాటించాలి

● రాయచూరు కలెక్టర్ నితీశ్ కుమార్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీసీ నితీశ్ కుమార్

రాయచూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తిలో ఉన్నవారు నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని జిల్లాధికారి నితీశ్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలందించే ఆర్ఎంపీలు, పీఎంపీలు తమ పరిధిలోనే వైద్య సేవలు అందించాలని పరిమితికి మించిన వైద్య సేవలు అందించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. దీంతో పాటే క్లినిక్‌లు నిర్వహించుకునే వారు వచ్చే రోగులకు తాగునీటి వసతితో పాటు పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుకునేలా తప్పని సరిగా విధులు నిర్వహించాలన్నారు. జిల్లా పంచాయతీ, జిల్లా పాలన విభాగం, వైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ, ఎంపీఐ ఆధ్వర్యంలో గురువారం కొత్త జిల్లాధికారి కార్యాలయంలో వైద్య వృత్తిదారుల కోసం చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సమావేశంలో మాట్లాడిన జిల్లాధికారి గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించే ఆర్ఎంపీలు తమ పరిధి దాటవన్నారు. ఈ విషయంలో ఇప్పటికే అనేక సార్లు ఫిర్యాదులు అందుతున్న నేపధ్యంలో బాధ్యుల పై చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. కేపీఎంఈ, పీసీ, పీఎన్‌డీటీ నిబంధనల పై తప్పని సరిగా అవగాహన పెంచుకోవాలన్నారు.

దివ్యాంగులను ఆదుకుందాం

● పంచాయతీ సమితి అధ్యక్షుడు రాజశేఖర్



దివ్యాంగుడు వెంకటేష్‌కు ఇస్త్రీపెట్టె అందజేస్తున్న దాతలు

కంప్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : సమాజంలో వైకల్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి, ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కుడితిని పట్టణ పంచాయతీ స్థాయి సమితి అధ్యక్షులు రాజశేఖర్ తెలిపారు. కుడితిని పట్టణంలో వెంకటేష్ అంగవికలాంగులతో తమ జీవితమే గడిపేందుకు కష్టంగా ఉన్న సమయంలో స్థాయి సమితి రాజశేఖర్‌ను ఆశ్రయించగా మంత్రి సంతోష్ లాడ్ నుండి ఒక షాపును ఏర్పాటు చేశారు. రాజశేఖర్ తమ వంతుగా ఇస్త్రీ సామాగ్రి, ఇస్త్రీ పెట్టే వెంకటేష్‌కు అందించి తమ వంతుగా ఆదుకున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ సమాజంలో వుండే ధనికులు ప్రతి ఒక్కరు ముందుకొచ్చి పేద కుటుంబాల్లో పొట్ట గడవక వుంటున్న వారిని గుర్తించి ప్రతి ఒక్కరు ఆదుకోవాలని సూచించారు. కౌన్సిలర్ వెంకటరమణబాబు, ప్రతాప్, మాంతేష్, గిరిస్వామి, రసూల్‌సాబ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం



ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ అధికారులు

బళ్లారి సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) దుకాణాలపై దాడులు నిర్వహించిన అధికారులు ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం జిల్లాలోని సండూర్ తాలూకా కురెకుప్ప గ్రామ మున్సిపాలిటీ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిందేనని మున్సిపల్ అధికారులు తెలిపారు. గురువారం పట్టణంలోని 18దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించి ప్లాస్టిక్‌ను స్వాదీనం చేసుకుని జరిమానా విధించారు. ఈదాడిలో 8కిలోల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాదీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ నిషేధ మార్గదర్శకాలను ఉల్లంఘించిన వ్యాపారులకు రూ.1000 జరిమానా విధించారు. మున్సిపల్ ఆరోగ్య శాఖ సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

హోసూరు జోన్

వ్యవసాయ విజ్ఞాన ప్రదర్శన ప్రారంభం

హోసూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా వేపనపల్లి సమీపాన కుందారపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటైంది. కలెక్టర్ దినేశ్‌కుమార్, హోసూరు ఎమ్మెల్యే ప్రకాశ్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఇదే సందర్భంగా పూర్వీకులు ఉపయోగించే సామగ్రిని ప్రదర్శించారు. రోళ్లు, రోకళ్లు, చేటలు, గంపలను ఉంచారు. 23మంది రైతులకు రూ.54,164 విలువైన సంక్షేమాలను అందచేశారు. పూర్వీకులు ఆరోగ్యంగా ఉండేందుకు సంప్రదాయ పద్ధతులు పాటించడమే అని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. అదే రీతిన వ్యవసాయంలో సంప్రదాయంతోపాటు ఆధునికత పాటించాల్సిన అవసరం ఉందన్నారు.



ప్రదర్శనను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్ కుమార్, ఎమ్మెల్యే ప్రకాశ్

కేంద్రమంత్రితో ఎంపీ భేటీ



కేంద్రమంత్రి గడ్కరీతో ఎంపీ గోపినాథ్

హోసూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర భూ ఉపరితల రవాణామంత్రి నితిన్‌గడ్కరితో కృష్ణగిరి ఎంపీ గోపినాథ్ భేటీ అయ్యారు. హోసూరు జాతీయ రహదారికి మరమ్మతు చేయాలని, రింగ్‌రోడ్డును త్వరగా పూర్తి చేయాలని కోరగా సానుకూలం వ్యక్తం చేసినట్టు గోపినాథ్ తెలిపారు. హోసూరు - బాగలూరు - సర్జాపుర రహదారి నాణ్యత పెంచాలని కోరినట్టు ఒక ప్రకటనలో తెలిపారు.

400 ఎల్ఈడీ బల్బులు అందజేసిన జిందాల్

కంప్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో, పట్టణంలో సంస్థలు ఇచ్చే సౌకర్యాలను ప్రతి ఒక్కరు సద్వినియోగపరచుకోవాలని కుడితిని పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు సుజాత సత్యప్ప తెలిపారు. గురువారం కుడితిని పట్టణానికి సీఎస్ఆర్ నిధులు కింద జిందాల్ సహా ఆధ్వర్యంలో 400 ఎల్ఈడీ విద్యుత్ లైటింగ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుజాతసత్యప్ప మాట్లాడుతూ కుడితిని పట్టణం చుట్టూ ఎన్నో ఫ్యాక్టరీలు ఉన్నాయి. ప్రతి ఫ్యాక్టరీ పట్టణం అభివృద్ధి దృష్టిలో వుంచుకుని సీఎస్ఆర్ నిధులతో పట్టణంలో అభివృద్ధి పనులు జరపాలని కోరారు. స్థాయి సమితి అధ్యక్షుడు వి రాజశేఖర్ ముఖ్య అధికారి తీర్థప్రసాద్, రవికుమార్, ప్రకాష్, భగవత్, సుభాని, యువరాజు, ప్రకాష్, నళినీ, యాస్మిన్ పాల్గొన్నారు.



ఎల్ఈడీ బల్బులు అందజేస్తున్న జిందాల్ ప్రతినిధులు